సాక్షి
డా. బి ఆర్ అంబేడ్కర్ కోనసీమ

శుక్రవారం । 14 । ఏప్రిల్ । 2023



విశ్వవేదికపై సైకత పతాకం

ఇసుక రేణువులను కుప్పగా పోసి, వివిధ ఆకృతులుగా మలిచి అందమైన శిల్పాలను రూపొందించడంలో తమకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్నారు దేవిన సిస్టర్స్. - 8లో ▸



ఇటుకలు విసిరి.. కారం చల్లి..

మద్యం కేసులో నిందితుడిని అదుపులోకి తీసుకునే క్రమంలో కాకినాడ ఇంద్రపాలెం సౌత్ సెబ్ సిబ్బందికి చేదు అనుభవం ఎదురైంది. - 8లో ▸

డెల్టాలకు నీరు విడుదల



ధవళేశ్వరం: కాటన్ బ్యారేజీ నుంచి గురువారం తూర్పు డెల్టాకు 1,400, మధ్య డెల్టాకు 450, పశ్చిమ డెల్టాకు 3 వేల క్యూసెక్కుల నీటిని వదిలారు. బ్యారేజీ వద్ద నీటి మట్టం 4.70 అడుగులకు చేరింది.



న్యూస్‌రీల్

సైన్స్ పరీక్షకు 175 మంది గైర్హాజరు

రాయవరం/ముమ్మిడివరం: పదవ తరగతి పరీక్షల్లో భాగంగా గురువారం నిర్వహించిన సైన్స్ పరీక్షకు 175 మంది గైర్హాజరయ్యారు. పరీక్షకు గైర్హాజరైన విద్యార్థుల్లో 109 మంది బాలురు, 66 మంది బాలికలున్నారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా వ్యాప్తంగా 111 పరీక్షా కేంద్రాల్లో 20,139 మంది పరీక్షలు రాయాల్సి ఉండగా, 19,964 మంది విద్యార్థులు హాజరయ్యారు. ఫిజికల్ సైన్స్, బయలాజికల్ సైన్స్ పేపర్లకు వేర్వేరుగా ఓఎంఆర్ షీట్లు, సమాధానాల పత్రాలు ఇచ్చి, ఎక్కడా ఎటువంటి పొరపాట్లకు తావు లేకుండా పరీక్షలు నిర్వహించారు. అమలాపురం డివిజన్‌లో 11,148 మంది, రామచంద్రపురం డివిజన్‌లో 8,816 మంది పరీక్షలు రాశారు. 13,525 మంది ఇంగ్లిషు మీడియంలో, 4,501 మంది తెలుగు మీడియంలో పరీక్షలు రాశారు. ఆర్‌జేడీ నాగమణి సఖినేటిపల్లి, రామచంద్రపురం, ద్రాక్షారామం, కె.గంగవరం మండలాల్లో పలు పరీక్షా కేంద్రాలను పరిశీలించగా, ప్రత్యేక స్క్వాడ్ 42 పరీక్షా కేంద్రాలను తనిఖీ చేసింది. పరీక్షలు సజావుగా జరిగాయని ప్రభుత్వ పరీక్షల విభాగం అసిస్టెంట్ కమిషనర్ బొజ్జా రమణశ్రీ తెలిపారు. ఈ నెల 15న సోషల్ స్టడీస్ పరీక్షతో పదో తరగతి ప్రధాన పరీక్షలు ముగిసినట్లవుతుందని జిల్లా విద్యాశాఖాధికారి ఎం.కమలకుమారి తెలిపారు.


వసతి గృహాన్ని తనిఖీ చేసిన జూనియర్ సివిల్ జడ్జి



వసతి గృహాన్ని తనిఖీ చేస్తున్న జూనియర్ సివిల్ జడ్జి శ్రీనివాస్

ముమ్మిడివరం: శివాలయం వీధిలో ఉన్న బీసీ బాలికల వసతి గృహాన్ని ముమ్మిడివరం జూనియర్ సివిల్ జడ్జి ఎస్.శ్రీనివాస్ గురువారం తనిఖీ చేశారు. మెనూ ప్రకారం భోజనం పెడుతున్నారా, మంచినీటి సౌకర్యం, మరుగుదొడ్ల పరిశుభ్రత వంటి విషయాలు పరిశీలించారు. వసతి సౌకర్యాలు ఎలా ఉన్నాయని విద్యార్థినులను అడిగి తెలుసుకున్నారు. రికార్డులను పరిశీలించి వసతి గృహ అధికారులు, సిబ్బంది అందుబాటులో ఉంటున్నది లేనిదీ ఆరా తీశారు. వసతి గృహంలో ఏమైనా ఇబ్బందులు ఉంటే తమ దృష్టికి తీసుకువస్తే పరిశీలిస్తామన్నారు. ఆయన వెంట బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కేఎల్‌వీ ప్రసాద్, న్యాయవాదులు అలీ హసన్, పోలీసు సిబ్బంది ఉన్నారు.


సీఎం జగన్‌కు జీవితాంతం రుణపడి ఉంటాం



ఎంఈవో సూర్యప్రకాష్ వద్ద ఆనందాన్ని వ్యక్తం చేస్తున్న విధుల్లో చేరిన ఉపాధ్యాయులు

అమలాపురం టౌన్: జిల్లాలో 91 మంది 1998 డీఎస్సీ క్వాలిఫైడ్ అభ్యర్థులకు ఉపాధ్యాయ ఉద్యోగాలు వచ్చాయి. రెండున్నర దశాబ్దాలుగా ఉద్యోగాల కోసం ఎదురు చూస్తున్న వారికి ఎట్టకేలకు ఉపాధ్యాయ ఉద్యోగ కల నెరవేరింది. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నాడు ప్రతిపక్ష నేతగా పాదయాత్రలో తమకు మాట ఇచ్చి ఇప్పుడు నెరవేర్చారని ఆనందం వ్యక్తం చేస్తున్నారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి మేమంతా జీవితాంతం రుణపడి ఉంటామని ఉపాధ్యాయ ఉద్యోగాలు సాధించిన ఆ 91 మంది అంటున్నారు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా 1998 డీఎస్సీ క్వాలిఫైడ్ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు సీహెచ్ కేశవరావు ఆధ్వర్యంలో ఉద్యోగాలు సాధించినవారు స్థానిక ఎంఈవో గుబ్బల సూర్యప్రకాష్‌ను గురువారం రాత్రి కలిసి తన ఆనందాన్ని వ్యక్తం చేశారు. బుధవారం అర్ధరాత్రి తర్వాత కాకినాడ డీఈవో కార్యాలయంలో తమకు ఉద్యోగ నియామక ఉత్తర్వులు అందజేశారని వారు తెలిపారు. ఉద్యోగాలు పొందిన 91 మంది గురువారం జిల్లాలో తమకు కేటాయించిన పాఠశాలలో విధులకు హాజరయ్యారు.

గండాలు దాటిన బొండాలు



కొత్తపేట మండలం వాడపాలెంలో బాగా పండిన వరి చేను

- ఫలించిన రాష్ట్ర ప్రభుత్వ మంతనాలు
- ఈ రకం ధాన్యం కొనుగోలుకు ఓకే
- కేరళతో కుదిరిన ఒప్పందం
- అదేబాటలో ముందుకొచ్చిన ఎఫ్‌సీఐ

సాక్షిప్రతినిధి, కాకినాడ: ముతక రకంగా ముద్రపడిన బొండాలు ధాన్యం కొనుగోలుపై సందిగ్ధత తొలగిపోయింది. రైతు పక్షాన రాష్ట్ర ప్రభుత్వం చూపిన చొరవ ఫలించింది. ఈ రబీలో సాగుచేసిన బొండాలు రకం కొనుగోలుకు ఎఫ్‌సీఐ ఎట్టకేలకు అంగీకరించింది. వాస్తవానికి కొన్నేళ్లుగా బొండాలకు తమిళనాడు, కేరళ, ఒడిశా తదితర రాష్ట్రాల్లో డిమాండ్ కొరవడింది. దీంతో రైతులు నష్టపోతూ వస్తున్నారు. పొరుగు రాష్ట్రాలకు ఎగుమతి చేసినా సరిగా సొమ్ము చేతికందేది కాదు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో గతంలో 2.1 లక్షల ఎకరాల్లో బొండాలు సాగుచేసేవారు. ఈ రకానికి పొరుగు రాష్ట్రాల్లో డిమాండ్ తగ్గిందని గ్రహించిన రైతులు ఐదేళ్లుగా సాగు తగ్గిస్తూ వచ్చారు. వీరి ఇబ్బందులను రాష్ట్ర ప్రభుత్వం గమనించి బొండాలు సాగుతో నష్టపోవద్దని వ్యవసాయశాఖ ద్వారా అవగాహన కల్పిస్తోంది. అయినా కొంతమంది కాస్త ధర ఎక్కువగా ఉంటుందనే కారణంతో ఈ రకం సాగుకే మొగ్గు చూపుతున్నారు. ఈ రబీ సీజన్‌లో కూడా వద్దువద్దంటున్నా కొందరు ఎక్కువ విస్తీర్ణంలోనే సాగు చేశారు.

కేంద్రం పచ్చజెండా

బొండాలు రకం సాగుతో నష్టాల బాటపట్టిన రైతుల విషయంలో ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి సానుకూలంగా వ్యవహరించారు. పౌరసరఫరాలశాఖ ఉన్నతాధికారులతో మాట్లాడారు. ఈ రబీలో బొండాలు సాగుచేసిన రైతులకు ఇబ్బంది కలగకుండా చూడాలని ఆదేశించారు. రాష్ట్ర ప్రభుత్వం తరఫున మంత్రి కారుమూరి నాగేశ్వరరావు ఇటీవల పలు దఫాలు కేరళ పౌరసరఫరాల ప్రతినిధి బృందంతో కూడా చర్చలు జరిపారు. ఫలితంగా బొండాలు రకం కొనుగోలుకు అంగీకరించారు. రాష్ట్ర ప్రభుత్వం చొరవతో మరో అడుగు ముందుకేసింది. కేంద్ర ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లింది. అన్ని స్థాయిల్లో ఒత్తిడి తెచ్చింది. ఎఫ్‌సీఐ ద్వారా కూడా కొనుగోలుకు ఒప్పించగలిగింది. ఈ రకం కొనుగోలుకు బుధవారం కేంద్రం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. పౌరసరఫరాల శాఖ ద్వారా రబీలో ఈ ధాన్యాన్ని కనీస మద్దతు ధరకే కొనుగోలు చేయనుంది. ఈ పరిణామంపై రైతాంగం హర్షం వ్యక్తం చేస్తోంది.

పోటాపోటీ సాగు

రాష్ట్రంలో రబీ సీజన్‌లో బొండాలు రకం అత్యధికంగా సాగు చేసిన జిల్లాలో ఉమ్మడి తూర్పుగోదావరి మొదటి వరుసలో ఉంది. గతంలో కేరళ ప్రజలు ఎంతో ఇష్టంగా ఈ బియ్యాన్ని తినేవారు. దీంతో అక్కడి మార్కెట్‌లో మంచి ధర వచ్చేది. దిగుబడికి దీటుగా లాభాలు రావడంతో ఒకరిని చూసి ఒకరు బొండాలు సాగుకు పోటీపడ్డారు. రానురాను కేరళ సివిల్ సప్లయిస్ కోట్లాది రూపాయలు బకాయి పడింది. దీంతో బొండాలు కొనుగోలుకు మిల్లర్లు ఆసక్తి చూపడం తగ్గించారు. గత్యంతరం లేని పరిస్థితుల్లో రైతులు అయినకాడికి అమ్ముకునేవారు. కనీస మద్దతు ధర లభించక వరుస నష్టాలను చవిచూసేవారు.

ముందుకు వచ్చిన కేరళ

రాష్ట్ర ప్రభుత్వం తాజాగా తీసుకున్న చొరవ ఫలితంగా ఎఫ్‌సీఐతో పాటు ఈ ధాన్యం దిగుమతికి కేరళ ముందుకు వచ్చింది. ఈ రెండూ అంశాలూ కలిసొచ్చాయి. ఈ రబీ సీజన్‌లో తూర్పుడెల్టాలోని మండపేట, రామచంద్రపురం, అనపర్తి, కడియం నియోజకవర్గాలు, సెంట్రల్ డెల్టాలోని అమలాపురం, ముమ్మిడివరం, కొత్తపేట, పి.గన్నవరం, కాకినాడ జిల్లాలో పిఠాపురం, పెద్దాపురం, కాకినాడ రూరల్ తదితర నియోజకవర్గాల్లో బొండాలు సాగు చేశారు. ఈసారి రబీ సీజన్‌లో కాకినాడ జిల్లాలో సైతం బొండాలు కూడా సాగు చేయడం విశేషం. కొద్దిరోజులుగా ధాన్యం కొనుగోలుపై ఏర్పడిన దిగులు తొలగిపోయిందని రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం వేసిన అడుగుల ఫలితంగా మార్గం సుగమమైందంటున్నారు.

సాగుతీరు (ఎకరాల్లో)

జిల్లా	విస్తీర్ణం	బొండాలు సాగు	దిగుబడి
తూ.గో.	1.79 లక్షలు	22,000	76 వేల మె.టన్నులు
కోనసీమ	1.72 లక్షల	85,500	3.08 లక్షల మె.టన్నులు
కాకినాడ	62 లక్షలు	87,601	2.60 లక్షల మె.టన్నులు

గిట్టుబాటు ధర



పదెకరాలు కౌలుకు తీసుకుని సాగు చేస్తున్నాను. మద్దతు ధర కష్టమని.. బొండాలు మినహా ఇతర రకాలు పండించాలని వ్యవసాయ అధికారులు చెప్పారు. సన్నాలు వంటి ఇతర రకాలు సరిగ్గా పండవు, విరిగిపోతాయి. ఈ కారణంతో ఎంటీయూ–3626 (బొండాలు) రకం పండించాను. ఎకరాకు 50 బస్తాలు పైబడి దిగుబడి వస్తుందని లెక్క లేసుకున్నాను. పౌరసరఫరాలశాఖ కొనుగోలు చేయకపోతే చాలా ఇబ్బంది పడేవాళ్లం. ఈ విషయంలో ప్రభుత్వం ముందుకు రావడం సంతోషంగా ఉంది. కనీస మద్దతు ధరతో అదనపు ఆదాయం వస్తుంది.

– గనిశెట్టి నాగేశ్వరరావు, వాడపాలెం, కొత్తపేట మండలం

సమర్థంగా ఓటర్ల జాబితా సవరణ

సాక్షి అమలాపురం: ఎన్నికల సంఘం నిబంధనల మేరకు ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ ప్రక్రియను సమర్థంగా నిర్వహించాలని కలెక్టర్ హిమాన్షు శుక్లా కోరారు. అమరావతి నుంచి రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి ముఖేష్‌కుమార్ మీనా వివిధ జిల్లాల కలెక్టర్లు, జాయింట్ కలెక్టర్లతో గురువారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఎన్నికల జాబితా ప్రత్యేక సవరణ, పోలింగ్ కేంద్రాల మార్పు, కొత్తవి ఏర్పాటు, పోలింగ్ కేంద్రాలలో కనీస వసతుల పరిశీలన, ఫొటో ఎంట్రీలు, ఓటర్ల నమోదు, ఓటర్ల జాబితాలో మార్పులు చేర్పులు, మరణించినవారి ఓట్ల తొలగింపు వంటి అంశాలపై సమీక్షించారు. అనంతరం ఎన్నికల విధులలో పాల్గొనే అధికారులతో కలెక్టర్ శుక్లా, జేసీ ధ్యానచంద్ర మాట్లాడారు. కలెక్టర్ మాట్లాడుతూ పోలింగ్ కేంద్రాల సర్దుబాటు, చిరునామాల మార్పు, 7 నోటిఫికేషన్ ద్వారా ఓటర్ల తొలగింపు ప్రక్రియలను ఎన్నికల సంఘం ప్రామాణిక నిబంధనలు మేరకు చేపట్టాలన్నారు. బూత్ లెవెల్ అధికారుల రిజిస్టర్లను ఎన్నికల అధికారులు పరిశీలించాలని ఆదేశించారు. డీఆర్వో సీహెచ్ సత్తిబాబు, ఆర్డీవోలు వసంతరాయుడు, ఎం.ముక్కంటి, పి.సింధు సుబ్రహ్మణ్యం నియోజకవర్గాల ఓటర్ జాబితా నమోదు అధికారులు వి. శివశంకర్ ప్రసాద్. జి.వి.సత్యవాణి పాల్గొన్నారు.



సమావేశంలో పాల్గొన్న కలెక్టర్ శుక్లా, జేసీ ధ్యానచంద్ర

- వైఎస్సార్ జగనన్న శాశ్వత భూహక్కు– భూరక్ష పథకం రీ సర్వేను వేగవంతం చేసి నిర్దేశిత గడువు నాటికి పూర్తి చేయాలని జేసీ ధ్యానచంద్ర సిబ్బందిని ఆదేశించారు. రాష్ట్ర భూ పరిపాలన ముఖ్య కమిషనర్ జి.సాయిప్రసాద్, సంయుక్త కార్యదర్శి ప్రభాకర్‌రెడ్డి విజయవాడ నుంచి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. రీ సర్వే ప్రక్రియలో వెబ్‌ల్యాండ్, భూ హక్కు పత్రాలు పంపిణీ అంశాల పురోగతిపై వారు సమీక్షించారు. అనంతరం జేసీ ధ్యానచంద్ర స్థానిక అధికారులతో మాట్లాడారు. జిల్లాలో ఉన్న రోవర్లు అన్నింటితో రోజుకు 80 గ్రామాలు సర్వే పూర్తి చేయాలని ఆదేశించారు. వెబ్‌ల్యాండ్ డేటా ఎంట్రీలో పురోగతి సాధించాలన్నారు రెవెన్యూ రికార్డుల స్వచ్ఛీకరణకు అన్ని స్థాయిల్లో నోటిఫికేషన్లు జారీచేసి అభ్యంతరాల పరిష్కారం సకాలంలో పూర్తి చేయాలన్నారు. సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ ఏడీ గోపాలకృష్ణ, కలెక్టరేట్ సూపరింటెండెంట్ రమణకుమారి, డీటీలు చినబాబు రవికిరణ్ పాల్గొన్నారు.
- కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న సంక్షేమ పథకాల లబ్ధి పొందే ప్రతి ఒక్కరికీ ఆధార్ కార్డు అవసరమని కలెక్టర్ హిమాన్షు శుక్లా పేర్కొన్నారు. కలెక్టరేట్‌లో గురువారం జిల్లా స్థాయి ఆధార్ మానిటరింగ్ కమిటీ సమావేశం ఆయన అధ్యక్షతన నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ ఆధార్ కార్డును 10 సంవత్సరాలకు ఒకసారి అప్‌డేట్ చేయించుకోవాలన్నారు. కమిటీ సభ్యులతో ఆధార్ డాక్యుమెంటేషన్ అప్‌డేట్, చైల్డ్ ఎన్రోల్‌మెంట్‌లో పురోగతి, బయోమెట్రిక్ అప్‌డేట్‌పై సమీక్షించారు. ఆధార్ అప్‌డేట్‌కు సంబంధించిన వాల్ పోస్టర్‌ను కలెక్టర్ ఆవిష్కరించారు. డీఎంఅండ్‌హెచ్‌వో ఎం.దుర్గారావు దొర, డీఆర్‌డీఏ పీడీ వి.శివశంకర్ ప్రసాద్, జీఎస్‌డబ్ల్యూఎస్ నోడల్ అధికారి భీమేశ్వరరావు, ఐసీడీఎస్ పీడీ జి.వి.సత్యవాణి పాల్గొన్నారు.

ఇక పంట నాడి పట్టేస్తారు!

- ప్రతీ మండలంలో ప్లాంట్ హెల్త్ డయాగ్నోస్టిక్స్ సెంటర్
- ప్రతిష్టాత్మకంగా ఏర్పాటు చేస్తున్న రాష్ట్ర ప్రభుత్వం
- పీహెచ్‌డీసీ డాక్టర్లుగా ఆర్‌బీకే ఇన్‌చార్జిలు



కొత్తపేట మండలంలోని వాడపాలెం ఆర్‌బీకే

కొత్తపేట: రైతులు అధికోత్పత్తులు సాధించాలని, చెమటోడ్చి పండించిన పంటకు గిట్టుబాటు ధర పొందాలనే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం వ్యవసాయ రంగం అభివృద్ధికి ప్రాధాన్యం ఇస్తోంది. దానిలో భాగంగా వైఎస్సార్ రైతు భరోసా, ప్రకృతి వైపరీత్యాల్లో నష్టపోయిన పంటలకు సంబంధించి ఏ సీజన్‌లో నష్టానికి ఆ సీజన్‌లోనే ఇన్‌పుట్ సబ్సిడీ, పంటల బీమా తదితర పథకాలను అమలు చేస్తోంది. విత్తనాలు, ఎరువులు, పురుగు మందుల నకిలీ, నాణ్యత లోపాలకు చెక్ పెట్టేందుకు గ్రామీణ నియోజకవర్గానికో వైఎస్సార్ ఇంటిగ్రేటెడ్ అగ్రి ల్యాబ్ ఏర్పాటు చేసింది. కొత్తగా పంటల రక్షణకూ ఆరోగ్య కేంద్రాలను ఏర్పాటు చేస్తోంది. ఆరోగ్యకరమైన అధికోత్పత్తులకు ప్లాంట్ హెల్త్ డయాగ్నోస్టిక్ సెంటర్లు (పీహెచ్‌డీసీ) ఏర్పాటు చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం కసరత్తు చేస్తోంది. జిల్లాలో 1.93 లక్షల ఎకరాల విస్తీర్ణంలో వరి సాగు చేస్తుండగా 1.45 లక్షల ఎకరాల్లో ఉద్యాన పంటలు సాగు చేస్తున్నారు. దాదాపు ప్రతీ సీజన్‌లోనూ చీడ పీడలతో వ్యవసాయ, ఉద్యాన పంటలు దెబ్బతింటున్నాయి. పంటలకు వ్యాపించిన తెగులు ఏదో తెలియక రైతులు రకరకాల పురుగుమందులు వాడుతూ ఆర్థికంగా నష్టపోతున్నారు. అడ్డగోలుగా పురుగు మందులు పిచికారీ చేయడం వలన సమస్యలు మరింత పెరుగుతున్నాయి. పండించిన పంటలు విషతుల్యం అవుతున్నాయి. ఈ నేపథ్యంలో తక్కువ పెట్టుబడితో నాణ్యమైన దిగుబడులు పెంచడం, చీడపీడలను సకాలంలో గుర్తించి, వాటి నివారణకు పరిష్కారాలను సూచించడం లక్ష్యంగా ప్రభుత్వం పీహెచ్‌డీసీలను ఏర్పాటు చేస్తోంది.

ఖరీఫ్ నాటికి మండలానికి ఒక ఆరోగ్య కేంద్రం

మొదటి దశలో మండలానికి ఒకటి చొప్పున పీహెచ్‌డీసీని ఏర్పాటు చేయనున్నారు. ఇవి వచ్చే ఖరీఫ్ (తొలకరి) సీజన్ ప్రారంభం నాటికి రైతులకు అందుబాటులోకి రానున్నాయి. ప్రతీ మండలంలో సొంత భవనం కలిగిన రైతు భరోసా కేంద్రం (ఆర్‌బీకే)లో పీహెచ్‌డీసీని ఏర్పాటు చేస్తారు. ఆ మేరకు ఇప్పటికే ఆ ఆర్‌బీకేలను గుర్తించారు. పీహెచ్‌డీసీ డాక్టర్లుగా మొదటి ప్రాధాన్యతగా అగ్రికల్చర్/ హార్టీకల్చర్ ఎమ్మెస్సీ చేసిన ఆర్‌బీకే ఇన్‌చార్జిలను ఎంపిక చేయాల్సి వుంది. ఈ అర్హతలు కలిగినవారు లేకపోతే అగ్రికల్చర్/ హార్టీకల్చర్ బీఎస్సీ చేసిన ఆర్‌బీకే ఇన్‌చార్జిలను, వారూ లేకపోతే అగ్రికల్చర్/హార్టీకల్చర్ డిప్లమా చేసిన వారిని ఎంపిక చేస్తారు. ఈ విధంగా జిల్లాలోని 22 మండలాల్లో 22 ఆర్‌బీకేలను గుర్తించారు. ఆయా ఆర్‌బీకేలలో డాక్టర్లుగా తగిన అర్హతలు కలిగిన ఇన్‌చార్జిలను నియమించారు.

మూడు విడతలుగా శిక్షణ కార్యక్రమాలు

పీహెచ్‌డీసీ డాక్టర్లకు అనుబంధంగా పొలంబడి మాస్టర్ ట్రైనర్లలో ఇద్దరు, తోటబడి ట్రైనర్లలో ఇద్దరు ఉంటారు. మండల వ్యవసాయ అధికారులుగా, హార్టీకల్చర్ అధికారులుగా ఉన్నవారిని ఇప్పటికే నియమించారు. మేజర్ అండ్ మైనర్ క్రాప్స్‌నకు రిసోర్స్ పర్సన్లుగా ఇద్దరు సైంటిస్టులను, హార్టీకల్చర్ క్రాప్స్‌నకు ఇద్దరు సైంటిస్టులను నియమించారు. జిల్లాలో అత్యధిక శాతం విస్తీర్ణంలో వరి, అరటి, కొబ్బరి పంటలు సాగవుతుండగా వరి పంటకు సంబంధించి పశ్చిమగోదావరి జిల్లా మార్టేరు వరి వ్యవసాయ పరిశోధనా స్థానం, అరటి పంటకు తూర్పుగోదావరి జిల్లా కొవ్వూరు అరటి పరిశోధనా స్థానం, కొబ్బరికి సంబంధించి కోనసీమ జిల్లాలోని అంబాజీపేట కొబ్బరి వ్యవసాయ పరిశోధనా స్థానం శాస్త్రవేత్తలు, పీహెచ్‌డీసీ డాక్టర్లు, పొలంబడి, తోటబడి ట్రైనర్లకు శిక్షణ ఇస్తారు. వ్యవసాయ, ఉద్యాన పంటలకు సోకే చీడపీడలు, వాటి లక్షణాలు, నివారణ పద్ధతులపై అవగాహన కల్పిస్తారు. వ్యవసాయ, ఉద్యాన పంటల్లో ఎటువంటి సమస్య తలెత్తినా మండలంలోని పీహెచ్‌డీసీలో పరిష్కారాలను సూచిస్తారు.

సైంటిస్టులు, మాస్టర్ ట్రైనర్లు

జిల్లాలో 22 మండలాల నుంచి 22 పీహెచ్‌డీసీ (ఆర్‌బీకే)లకు ట్రైనీ డాక్టర్లుగా ఆర్‌బీకే ఇన్‌చార్జిలుగా ఉన్న వీఏఏ/వీహెచ్‌ఏలను నియమించారు. వారికి అనుబంధంగా పొలంబడి మాస్టర్ ట్రైనర్లుగా ఉన్న మలికిపురం మండల ఏఓ ఎం.రాకేష్, కె.గంగవరం మండల ఏఓ బి.రవి, తోటబడి మాస్టర్ ట్రైనర్స్ కొత్తపేట హెచ్‌ఓ ఎం అనూష, రాజోలు హెచ్‌ఓ ఎం.దిలీప్‌కుమార్‌లను నియమించారు. చీడపీడల నివారణ, సమస్యల పరిష్కారానికి, అవగాహన కల్పించేందుకు వరి, మొక్కజొన్న వంటి మేజర్, మైనర్ పంటలకు డాట్ సెంటర్ సైంటిస్టులు డాక్టర్ సీహెచ్ నరసింహారావు, డాక్టర్ పి.భరత్‌చంద్ర, హార్టీకల్చర్ పంటలకు డాక్టర్ ఎ.కిరీటి, డాక్టర్ వి.గోవర్ధన్ రిసోర్స్ పర్సన్లుగా వ్యవహరిస్తారు.

పెట్టుబడి వ్యయం తగ్గుతుంది



వ్యవసాయ, ఉద్యాన శాఖల సలహాలు, సూచనలను కొందరు రైతులు పాటిస్తున్నప్పటికీ అనేకమంది అవగాహన లేక కెమికల్స్ వాడుతున్నారు. దీంతో పెట్టుబడి వ్యయం పెరిగిపోతోంది. పరిస్థితిని నివారించేందుకు ప్రభుత్వం పీహెచ్‌డీసీలను ఏర్పాటు చేస్తోంది. దీని ద్వారా అవసరమైన మందు, తగిన మోతాదు ప్రకారం వినియోగిస్తారు. తద్వారా ఖర్చు తగ్గుతుంది.

– ఎం.వెంకటరామారావు, ఏడీఏ, కొత్తపేట

నా సర్వీసులో సుధీర్‌కుమార్‌రెడ్డి బెస్ట్ ఎస్పీ

వీడ్కోలు సభలో కలెక్టర్ హిమాన్షు శుక్లా



ఎస్పీ సుధీర్‌కుమార్‌రెడ్డిని సత్కరిస్తున్న కలెక్టర్

అమలాపురం టౌన్: ఐఏఎస్ అధికారిగా నా పదేళ్ల సర్వీస్‌లో ఎస్పీ సుధీర్‌కుమార్‌రెడ్డి లాంటి బెస్ట్ పోలీసు ఆఫీసర్‌ను చూడలేదు, జిల్లాలో ఏ గ్రామానికి వెళ్లినా ఆయన పోలీసింగ్ గురించి ప్రజలు బాగా చెప్పుకోవడమే విన్నానని కలెక్టర్ హిమాన్షు శుక్లా అన్నారు. స్థానిక సత్యనారాయణ గార్డెన్స్‌లో జిల్లా పోలీసు శాఖ ఆధ్వర్యంలో ఎస్పీ సుధీర్‌కుమార్‌రెడ్డికి గురువారం మధ్యాహ్నం జరిగిన వీడ్కోలు సభకు కలెక్టర్ శుక్లా ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. సుధీర్‌కుమార్‌రెడ్డి అమలు చేసిన పోలీసింగ్ మార్క్‌ను...ఆయన పని తీరు శైలిని కొనసాగిస్తానని జిల్లా కొత్త ఎస్పీ సుసారపు శ్రీధర్ చెప్పారు. సభకు అధ్యక్షత వహించిన ఏఎస్పీ లతా మాధురి మాట్లాడుతూ కోనసీమ సింగంగా ఎస్పీ సుధీర్‌కుమార్‌రెడ్డి ఈ జిల్లాకు సేవలు అందించారని.. ఓ సింహంలా వచ్చి అదే స్థాయిలో రాజీ అనే పదానికి తావులేకుండా పనిచేశారని పేర్కొన్నారు. డీఆర్వో సీహెచ్ సత్తిబాబు, ఆర్డీవో వసంతరాయుడు మాట్లాడుతూ సున్నితమైన కోనసీమ ప్రాంతానికి తనదైన శైలిలో పనిచేసి సమర్థ అధికారిగా జిల్లాపై బలమైన ముద్ర వేసుకుని వెళుతున్నారని పేర్కొన్నారు. అమలాపురం, కొత్తపేట డీఎస్పీలు వై.మాధవరెడ్డి, వెంకటరమణ, పి.గన్నవరం సీఐ డి.ప్రశాంత్‌కుమార్, ఎస్పీ కార్యాలయ ఏవో జగన్నాథరావు, జిల్లాలోని పలువురు ఎస్సైలు ప్రసంగించారు. తూర్పుగోదావరి జిల్లా ఎస్పీగా బదిలీపై వెళుతున్న సుధీర్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ ఇక్కడ సమర్థంగా పనిచేయడం పోలీసుశాఖ, ప్రజలు అందించిన సహకారంతో సాధ్యమైందన్నారు. అనంతరం జిల్లా పోలీసు శాఖ ఆధ్వర్యంలో ఎస్పీ సుధీర్‌కుమార్‌రెడ్డికి ఘన వీడ్కోలు, అభినందన సత్కారం జరిగింది. ఏఆర్ డీఎస్పీ పి.సుధీర్‌కుమార్‌రెడ్డి, ఎస్బీ సీఐ కోలా రజనీకుమార్, అమలాపురం పట్టణ సీఐ ద్వారంపూడి దుర్గా శేఖరరెడ్డి తదితరుల ఆధ్వర్యంలో వీడ్కోలు సభ ఏర్పాట్లు జరిగాయి.

ఆర్థిక పురోగతికి మహిళా సమ్మాన్ సేవింగ్స్ పథకం



బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న ఎంపీ అనురాధ

అల్లవరం: మహిళలు, బాలికలు ఆర్థిక పురోగతిని సాధించేందుకు మహిళా సమ్మాన్ సేవింగ్స్ పథకాన్ని రెండేళ్ల కాలానికి పోస్టల్ శాఖ ప్రవేశపెట్టిందని అమలాపురం సూపరింటెండెంట్ శ్రీధర్ గురువారం తెలిపారు. మొగళ్ళమూరులోని ఎంపీ కార్యాలయంలో ఎంపీ అనురాధని గురువారం కలిసి మహిళా సమ్మాన్ సేవింగ్స్ పథకాన్ని వివరించారు. కనీసం రూ.వెయ్యి నుంచి రూ.2 లక్షల వరకు డిపాజిట్ వేసుకోవచ్చునని, రెండేళ్ల తర్వాత 7.5 శాతం వార్షిక వడ్డీతో తీసుకోవచ్చని శ్రీధర్ తెలిపారు. మహిళల అభ్యున్నతి కోసం ప్రవేశపెట్టిన ఈ పథకాన్ని వినియోగించుకోవాలని, తన ఇద్దరు కుమార్తెల పేరిట డిపాజిట్ చేశానని ఎంపీ తెలిపారు. అనంతరం మహిళా సమ్మాన్ సేవింగ్స్ బ్రోచర్‌ని ఎంపీ ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో సబ్ డివిజనల్ ఇన్‌స్పెక్టర్ వంశీకృష్ణ, బసవా అనిల్ పాల్గొన్నారు.

త్వరితగతిన అమృత్ సరోవర్ పనులు

ఉప్పలగుప్తం: గ్రామాల్లో అమలు చేస్తున్న అమృత్ సరోవర్ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని డ్వామా పీడీ కె.మధుసూదన్ అన్నారు. మండలంలోని గొల్లవిల్లి గ్రామంలో ఉన్న యల్లారమ్మ చెరువు వద్ద జరుగుతున్న అమృత్ సరోవర్ పనులను గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లావ్యాప్తంగా గ్రామీణ ప్రాంతాల్లో 80 చెరువులను అభివృద్ధి చేసే క్రమంలో ఉపాధి కూలీలకు పనిదినాలు కల్పించే విధంగా ఎంపిక చేశామన్నారు. వాటిలో 24 చెరువులు పూర్తయ్యాయని, 23 జరుగుతున్నాయని, 33 చెరువుల పనుల ప్రారంభించాల్సి ఉందని తెలిపారు. రాబోయే స్వాతంత్ర్య దినోత్సవం ఆగస్టు 15 నాటికి అమృత్‌సరోవర్ పనులు పూర్తిచేస్తామన్నారు. ఏపీవో వి.రాజామణి, టీఏలు నానిబాబు, దుర్గాదేవి, వైఎస్సార్ సీపీ నాయకుడు జొన్నాడ చిన్ని పాల్గొన్నారు.

గల్ఫ్ దేశాల్లో మహిళలకు ఉపాధి అవకాశాలు

అమలాపురం రూరల్: హౌస్ కీపింగ్, కుకింగ్, కేర్ టేకర్ శిక్షణతోపాటు గల్ఫ్ దేశాల్లో ఉపాధి అవకాశాలు కల్పించే కార్యక్రమానికి 18 నుంచి 45 సంవత్సరాల లోపు మహిళల నుంచి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ దరఖాస్తులు కోరుతోందని ఆ సంస్థ అధికారి పి.లోకమాన్ ఓ ప్రకటనలో తెలిపారు. నకిలీ వీసాలతో విదేశాలకు వెళుతున్న మహిళలు అక్కడ చట్టాలు తెలియక ఇబ్బందులు పడుతున్న క్రమంలో రాష్ట్ర ప్రభుత్వం ఈ కార్యక్రమం చేపట్టిందని పేర్కొన్నారు. తమ సంస్థ ద్వారా మహిళా అభ్యర్థులకు శిక్షణ ఇస్తామన్నారు. వివరాలకు సంస్థ కో ఆర్డినేటర్ నాగబాబును సంప్రదించాలన్నారు.

క్లుప్తంగా

కుమారుడు కనిపించడం లేదని ఫిర్యాదు


సత్యస్వరూప్ కుమార్ (ఫైల్)

గోపాలపురం: మండలంలోని చిట్యాల గ్రామానికి చెందిన గాలింకి సత్యస్వరూప్ కుమార్ కనిపించడం లేదంటూ కుటుంబ సభ్యులు గురువారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. పాస్టర్ గాలింకి విల్సన్ రెండో కుమారుడు సత్యస్వరూప్ కుమార్ ఇంటర్ చదువుతున్నాడు. ఎక్కువ సమయం సెల్‌ఫోన్‌తో ఉండటంతో తండ్రి విల్సన్ మందలించారు. దీంతో బుధవారం ఉదయం తొమ్మిది గంటలకు ఇంటి నుంచి బయటకు వెళ్లిన కుమారుడు సత్యస్వరూప్ రాత్రికి కూడా ఇంటికి రాకపోడంతో పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు ఎస్‌ఐ కె రామకృష్ణ తెలిపారు. ఆచూకీ తెలిసినవారు 94407 96665 నంబరులో తెలిపాలని ఎస్‌ఐ సూచించారు.

29న నవోదయ ప్రవేశ పరీక్ష

పెద్దాపురం: జవహార్ నవోదయ విద్యాలయలో 6వ తరగతి ప్రవేశానికి 29న ప్రవేశ పరీక్ష నిర్వహించనున్నట్లు విద్యాలయ ప్రిన్సిపాల్ కె.రామిరెడ్డి తెలిపారు. గురువారం ఆయన స్థానిక విలేకర్లతో మాట్లాడుతూ విద్యాలయలో ఖాళీగా ఉన్న సీట్లకు జిల్లా నుంచి 8,779 మంది విద్యార్థులు ప్రవేశ పరీక్షకు దరఖాస్తు చేస్తుకున్నారన్నారు. ఈ పరీక్షల నిర్వహణకు జిల్లాలో 36 పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు. కాకినాడ జిల్లాలో 14 పరీక్షా కేంద్రాల్లో, కోనసీమ జిల్లాలో 15 కేంద్రాల్లో, తూర్పు గోదావరి జిల్లాలో ఏడు కేంద్రాల్లో పరీక్షలకు ఏర్పాట్లు చేశామన్నారు. పరీక్ష ఉదయం 11.30 నుంచి 1.30 గంటల వరకు ఉంటుందని, విద్యార్థులు 10.30 లోపే పరీక్ష కేంద్రాల వద్దకు చేరుకోవాలన్నారు. మూడు జిల్లాల విద్యాశాఖాధికారుల ఆధ్వర్యంలో ఇప్పటికే అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని తెలిపారు.

నేడు జైభీమ్ ర్యాలీ

యానాం: రాజ్యాంగ నిర్మాత అంబేడ్కర్ 132వ జయంతిని పురస్కరించుకుని శుక్రవారం యానాం పట్టణంలోని పాత బస్టాండ్ అంబేడ్కర్ సర్కిల్ నుంచి జైభీమ్ ర్యాలీని నిర్వహించనున్నట్లు నిర్వాహకులు గురువారం ఓ ప్రకటనలో తెలిపారు.

సాక్షి ఉద్యోగ అవకాశాలు

WANTED LECTURERS
★ Maths ★ Physics
★ Chemistry ★ Bio Chemistry
★ Commerce ★ Management
★ Comp. Science ★ Sanskrit
Interested candidates may contact with bio-data and relavant xerox copy's of certificates
RAJAMAHENDRI JUNIOR DEGREE & PG COLLEGE FOR WOMEN
Backside Street of South India Shopping Mall, Nr. Gokavaram Bus Stand, RAJAHMUNDRY

విశ్వవేదికపై సైకత పతాకం

- దేవిన సిస్టర్స్‌కు అంతర్జాతీయ గుర్తింపు
- అమెరికా సంస్థలు నిర్వహించిన ఆన్‌లైన్ పోటీల్లో ప్రథమ స్థానం
- తండ్రికి తగ్గ తనయులుగా గుర్తింపు





జాతీయ, అంతర్జాతీయ దినోత్సవాలకు దేవిన సిస్టర్స్ రూపొందించిన సైకత శిల్పాలు

రంగంపేట: ఇసుక రేణువులను కుప్పగా పోసి, వివిధ ఆకృతులుగా మలిచి అందమైన శిల్పాలను రూపొందించడంలో తమకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్నారు దేవిన సిస్టర్స్. తూర్పుగోదావరి జిల్లా రంగంపేటకు చెందిన సోహిత, ధన్యత చిన్నప్పటి నుంచే సైకత శిల్పాలను రూపొందించడంలో ప్రావీణ్యం సంపాదించారు. తండ్రి దేవిన శ్రీనివాస్ ప్రముఖ సైకత శిల్పి కావడంతో ఆయన నుంచి ఈ కళను నేర్చుకున్నారు.

చదువులో రాణిస్తూనే...

మండల కేంద్రమైన రంగంపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల్లో సోహిత 10వ తరగతి, ధన్యత 7వ తరగతి చదువుతున్నారు. ఒకవైపు చదువులో రాణిస్తూనే మరొక వైపు సైకత శిల్ప కళతో పాటు శాస్త్రీయ సంగీతంలో కూడా పట్టు సాధించి పలుచోట్ల ప్రదర్శనలు కూడా ఇస్తున్నారు.

అన్నీ ఆలోచింపజేసేవే....

దేవిన సిస్టర్స్ ఇప్పటి వరకు 12 సైకత శిల్పాలను వివిధ జాతీయ, అంతర్జాతీయ దినోత్సవాలకు రూపొందించారు. ఇవన్నీ సమాజాన్ని ఆలోచింపజేసేవిగానే ఉన్నాయి. ఆడపిల్లగా పుట్టడమే పాపమా, మాపై ఎన్నాళ్లీ అకృత్యాలు, అవనిలో సగం మేమే.. ఐనా మాపై వివక్షే అంటూ కొన్ని, రైతు సమస్యలు, కాలుష్యం, మాతృభాష, పర్యావరణంపై ఆలోచన కలిగించే సైకత శిల్పాలను రూపొందించి రాష్ట్ర వ్యాప్తంగా ప్రశంసలు అందుకున్నారు.

ప్రస్తుతం అంతర్జాతీయ ఆన్‌లైన్ పోటీల్లో గుర్తింపు

సోహిత, ధన్యత (దేవిన సిస్టర్స్) సైకత శిల్పకళలో గత ఏడాది ఏప్రిల్ 22న ధరిత్రీ దినోత్సవాన్ని పురస్కరించుకుని అమెరికాకు చెందిన సీస్ బ్రిటైర్ ఫౌండేషన్.. ఉయ్ ఆర్ ఫ్యామిలీ గ్లోబల్ ఫౌండేషన్‌తో కలసి అంతర్జాతీయ స్థాయిలో ఆన్‌లైన్లో నిర్వహించిన పోటీల్లో రూపొందించిన సైకత శిల్పానికి ప్రథమ స్థానం లభించింది. అందుకు సంబంధించిన ప్రశంసా పత్రాలు గురువారం వారికి అందాయి. డ్రాయింగ్, పెయింటింగ్, చార్కోల్ ఆర్ట్, డిజిటల్ ఆర్ట్, ఫొటోగ్రఫీ, ఇలా వివిధ అంశాల్లో ప్రపంచ వ్యాప్తంగా పలు దేశాలకు చెందిన వందలాది మంది విద్యార్థులు పాల్గొనగా ఇంగ్లండ్, అమెరికా, ఆస్ట్రేలియా, భారత్ దేశాలకు చెందిన న్యాయ నిర్ణేతలు సోహిత, ధన్యత రూపొందించిన సైకత శిల్పానికి ఏకగ్రీవంగా ప్రథమ స్థానం ప్రకటించారు. ఈ సంవత్సరం అంతా గ్లోబల్ స్థాయిలో పలు అంతర్జాతీయ సంస్థలు నిర్వహించే కార్యక్రమాల్లో ఈ సిస్టర్స్‌ను తమ సంస్థల ద్వారా ప్రోత్సహించనున్నట్టు తెలియజేస్తూ ఆహ్వాన పత్రికను కూడా పంపించారు.

మ్యూజియం ఏర్పాటే లక్ష్యం

భారతదేశం మొత్తం మీద సైకత శిల్పాలు రూపొందించే అక్కాచెల్లెళ్లు వీరిద్దరే కావడం గమనార్హం.


సోహిత, ధన్యత (దేవిన సిస్టర్స్)

శాస్త్రీయ సంగీతంలో తమ కంటూ ఒక ప్రత్యేక గుర్తింపు తెచ్చుకోవాలని, మన రాష్ట్రంలో సైకత శిల్పాల మ్యూజియాన్ని ఏర్పాటు చేయాలన్నదే తమ లక్ష్యమని దేవిన సిస్టర్స్ చెబుతున్నారు.

స్థల వివాద ఘర్షణల్లో 12 మందిపై కేసు

అమలాపురం టౌన్: స్థల వివాదంపై అమలాపురం రూరల్ మండలం రోళ్లపాలెంలో బుధవారం రాత్రి వేర్వురుగా ఇరు వర్గాల మధ్య జరిగిన ఘర్షణల ఘటనల్లో పట్టణ పోలీసులు మొత్తం 12 మందిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. పట్టణ సీఐ ద్వారంపూడి దుర్గాశేఖరరెడ్డి ఆధ్వర్యంలో పట్టణ సీఐ కేవీవీ సత్యనారాయణ ఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించారు. ఎస్సై సత్యనారాయణ చెప్పిన వివరాల ప్రకారం ఆ గ్రామానికి చెందిన రాయుడు వెంకటరమణ, గబ్బల వెంకట గణేష్ మధ్య కొంతకాలంగా స్థల వివాదాలు నడుస్తున్నాయి. ఈ క్రమంలో బుధవారం రాత్రి వెంటరమణ ఇంటికి వెంకట గణేష్ వర్గీయులు వచ్చి దాడి చేసి అతడిని గాయపరిచారన్నది అభియోగం. వెంకటరమణ అమలాపురం ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. వెంకటరమణపై దాడి జరిగిన కొద్దిసేపటికి తనపై కూడా వెంకటరమణ వర్గీయులు దాడి చేశారని వెంకట గణేష్ పట్టణ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఇరు వర్గాలు ఇచ్చిన ఫిర్యాదులపై కేసులు నమోదు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై సత్యనారాయణ తెలిపారు. వెంకటరమణ ఇచ్చిన ఫిర్యాదుపై తొమ్మిది మందిపైన, వెంకట గణేష్ ఇచ్చిన ఫిర్యాదుపై ముగ్గురిపైన కేసులు నమోదు చేసినట్లు ఎస్సై సత్యనారాయణ తెలిపారు.

ఆటో బోల్తా.. ఇద్దరు విద్యార్థులకు గాయాలు

- పదో తరగతి పరీక్షలకు వెళ్తుండగా ప్రమాదం
- 11 మంది విద్యార్థుల్లో ఇద్దరికి తీవ్రగాయాలు

ఐ.పోలవరం: మండలంలోని ఎదుర్లంక పోలీస్‌స్టేషన్ సమీపంలో గురువారం ఉదయం ఆటోబోల్తా పడిన ఘటనలో పదో తరగతి పరీక్షార్థులు గాయాలపాలయ్యారు. పోలీసులు, స్థానికులు అందించిన సమాచారం ప్రకారం గురువారం పదోతరగతి పరీక్షలు రాసేందుకు మండల పరిధిలో వివిధ గ్రామాలకు చెందిన 11మంది ఆటోలో ఎదుర్లంక జెడ్పీ ఉన్నత పాఠశాలకు పయనమయ్యారు. మార్గమధ్యంలో ఆటోడ్రైవర్ నిర్లక్షం కారణంగా ఆటో బోల్తాపడింది.

ఈ ఘటనలో లంకే తిరుపతి వెంకటేశ్వరరావుకు కాలు, సంగాని సత్యప్రసాద్‌కు చేయి విరిగిపోయింది. వీరిని కాకినాడలో ఓ ప్రయివేటు ఆసుపత్రిలో చేర్పించగా చికిత్స పొందుతూ కోలుకుంటున్నారు. వీరిద్దరూ పరీక్ష రాయలేకపోయారు. స్వల్పగాయాలతో బయటపడ్డ మిగిలిన వారికి ప్రథమ చికిత్స అందించి పరీక్షా కేంద్రానికి తరలించారు. ఈ ప్రమాదంలో తలకు గాయమైన ఓలేటి వెంకటేశ్వరరావును యానాం ప్రభుత్వాసుపత్రిలో చికిత్స అందించి పరీక్షా కేంద్రానికి తరలించారు. ఆటోలో ప్రయాణిస్తున్న 11మందిలో ఎనిమిది మంది విద్యార్థినులు, ముగ్గురు విద్యార్థులు ఉన్నారు. తీవ్రంగా గాయపడిన తిరుపతి వెంకటేశ్వరరావుది జి.మూలపొలం గ్రామం కాగా, సత్యప్రసాద్‌ది కాట్రేనికొన మండలం బలుసుతిప్ప. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఉన్నత్ భారత్ అభియాన్‌తో గ్రామీణాభివృద్ధి

రాజానగరం: ఉన్నత్ భారత్ అభియాన్‌తో గ్రామీణాభివృద్ధిని సాధించవచ్చని ఆదికవి నన్నయ యూనివర్సిటీ ఇన్‌చార్జి రిజిస్ట్రార్ ఆచార్య పి.సురేష్‌వర్మ అన్నారు. యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ ఎడ్యుకేషన్ ఆధ్వర్యంలో సెమినార్ హాలులో కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ఉన్నత్ భారత్ అభియాన్ పథకంపై గురువారం నిర్వహించిన వర్క్‌షాప్‌ను గాంధీ మహాత్ముని చిత్రపటానికి పూలమాల వేసి ప్రారంభించారు. సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుకుంటూ గ్రామాల అభివృద్ధికి కృషి చేయాలన్నారు. గ్రామీణాభివృద్ధి, సాంకేతిక రంగంలో సుదీర్ఘ కాలంగా పనిచేస్తున్న ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (ఐఐటీ) ఢిల్లీకి చెందిన ఫ్యాకల్టీ సభ్యుల బృందం చొరవతో ఈ పథకం ప్రారంభమైందన్నారు. దీనిలో భాగంగా విద్యాసంస్థల పరిధిలో ఐదు గ్రామాలను అభివృద్ధి చేసేందుకు ప్రణాళికను సూచించి, దానికి తగిన సహకారాన్ని కేంద్ర ప్రభుత్వం అందిస్తుందన్నారు. ఇందులో భాగస్వామి అయిన ఆదికవి నన్నయ యూనివర్సిటీ అనుబంధ కళాశాలలను ఆచార్య సురేష్‌వర్మ అభినందించారు. నోడల్ అధికారి ఆచార్య జి. నాగరాజు, రీజనల్ కోఆర్డినేటర్ డాక్టర్ బి.పావని మాట్లాడుతూ గాంధీజీ కలలుగన్న గ్రామ స్వరాజ్యం ఉన్నత్ అభియాన్ ద్వారా సాధ్యమవుతుందన్నారు. ప్రోగ్రామ్ కోఆర్డినేటర్, ప్రిన్సిపాల్ డాక్టర్ కె.సుబ్బారావు మాట్లాడుతూ ఈ పథకం లక్ష్యాలతోపాటు, సేంద్రియ వ్యవసాయం గురించి తెలుసుకోవడానికి ఈ సదస్సును ఏర్పాటు చేశామన్నారు. గ్రామీణాభివృద్ధిలో విద్యార్థులను భాగస్వాములను చేయడం మా బాధ్యతగా ఈ ప్రయత్నం చేస్తున్నామన్నారు. రీసోర్స్ పర్సన్లు ఆర్.నాగేంద్రబాబు, కొల్లి సనత్‌కుమార్ సేంద్రియ వ్యవసాయం, గ్రామాల అభివృద్ధి, ఉన్నత్ భారత్ అభియాన్ ద్వారా లభించే సహకారం గురించి వివరించారు. అసిస్టెంట్ కోఆర్డినేటర్ ఆర్.సాంబశివరావు, డాక్టర్ ఎస్.సుజాత, డాక్టర్ ఎం.గోపాలకృష్ణ, డాక్టర్ జి.ఎలీషాబాబు, డాక్టర్ జె.రాజామణి, డాక్టర్ దొర పాల్గొన్నారు.


వర్క్‌షాప్‌ను ప్రారంభిస్తూ, గాంధీజీ చిత్రపటానికి పూలమాల వేసిన యూనివర్సిటీ అధికారులు

పెన్సిల్ మొనపై అంబేడ్కర్ ప్రతిమ

పి.గన్నవరం: ఎల్.గన్నవరం శివారు నడిగాడి పాలిమేరకు చెందిన యువకుడు మానుకొండ సుమంత్ పెన్సిల్ మొనపై భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ప్రతిమను రూపొందించి అందరి ప్రశంసలు అందుకున్నాడు. అంబేడ్కర్ జయంతి సందర్భంగా ఆయన ప్రతిమను పెన్సిల్ మొనపై చెక్కాడు. దీనిని రూపొందించేందుకు మూడు రోజుల సమయం పట్టిందని సుమంత్ తెలిపాడు. గతంలో పెన్సిల్ లెడ్‌పై, బియ్యపు గింజపై పలువురి పేర్లు చెక్కాడు.



పెన్సిల్ మొనపై డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ప్రతిమను రూపొందించిన సుమంత్

గుర్తు తెలియని వ్యక్తి మృతి



రావులపాలెం: స్థానిక అమలాపురం రోడ్డులో బిర్యాని పాయింట్ వద్ద రోడ్డు పక్కన ఒక గుర్తు తెలియని వ్యక్తి మృతి చెంది ఉన్నట్టు గురువారం సాయంత్రం సమాచారం అందిందని ఎస్సై ఎం.వెంకటరమణ తెలిపారు. ఘటనా ప్రాంతాన్ని పోలీసులు పరిశీలించి వివరాలు నమోదు చేసుకున్నారు. మృతుడి ఊరు పేరు తెలియలేదని, వయస్సు 55 సంవత్సరాలు ఉండవచ్చన్నారు. ఒంటిపై నలుపు,తెలుపు గడియల చొక్కా వేసుకున్నాడన్నారు. మృతుడి వివరాలు తెలిసిన వారు పోలీసులకు సమాచారం ఇవ్వాలని ఎస్సై కోరారు. మృతదేహాన్ని కొత్తపేట మార్చురీకి తరలించామన్నారు.

యువతి అదృశ్యం

ముమ్మిడివరం: కళాశాలకు వెళ్లిన తన కుమార్తె ఇంటికి తిరిగి రాలేదని ముమ్మిడివరం నగర పంచాయతీ మూలతూముకు చెందిన చింతపల్లి శ్రీనుబాబు గురువారం ముమ్మిడివరం పోలీసులకు ఫిర్యాదు చేశారు. శ్రీనుబాబు కుమార్తె స్నేహ ముమ్మిడివరంలోని ఓ ప్రైవేటు కళాశాలలో బీకాం రెండో సంవత్సరం చదువుతోంది. ఈ నెల 10న ఇంటి నుంచి కళాశాలకు వెళ్లి తిరిగి రాలేదని ఆమె తండ్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నలుగురు పోలీసులకు సేవా పతకాలు

అమలాపురం టౌన్: జిల్లాలోని నలుగురు పోలీసులు ఉగాది సేవా పతకాలకు ఎంపికయ్యారు. రాష్ట్ర పోలీసు శాఖ ఈ పతకాల జాబితాను గురువారం విడుదల చేసింది. జిల్లాలోని ఒక ఎస్సై, ఒక హెడ్‌కానిస్టేబుల్, ఇద్దరు కానిస్టేబుళ్లకు ఈ పతకాలు లభించాయి. అమలాపురం డీటీఆర్‌బీ ఎస్సై జీబీవీవీ రామకృష్ణకు ఉత్తమ సేవా పతకం, జిల్లాకు చెందిన హెడ్ కానిస్టేబుల్ ఎం.వెంకట సత్య ఫణేశ్వరరావు, మండపేట పోలీసు స్టేషన్ కానిస్టేబుల్ ఎం.అశోక్, రామచంద్రపురం పోలీసు స్టేషన్ కానిస్టేబుల్ ఎం.శ్రీధర్‌లు సేవా పతకాలకు ఎంపికయ్యారు. వీరిని జిల్లా ఎస్పీ సుసారపు శ్రీధర్, ఏఎస్పీ కె.లతామాధురి, అమలాపురం, రామచంద్రపురం డీఎస్పీలు వై.మాధవరెడ్డి, బాలచంద్రారెడ్డి అభినందించారు. త్వరలో వీరిని రాష్ట్ర ప్రభుత్వం సత్కరించనుంది.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

మామిడికుదురు: నగరం గ్రామంలోని ఈదరాడ కాలువ గట్టు రోడ్డుపై బుధవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో పి.గన్నవరం మండలం వాడ్రేవుపల్లికి చెందిన గోగి రాజ్‌కుమార్ (25) అక్కడికక్కడే మృతి చెందాడు. పి.గన్నవరం మండలం వాడ్రేవుపల్లిలోని తన ఇంటి నుంచి రాజోలు మండలం చెన్నడంలో బంధువుల ఇంట్లో పెళ్లికి బైక్‌పై వెళ్తూ రాజ్‌కుమార్ ప్రమాదానికి గురయ్యాడు. మృతుని తండ్రి తులసీరావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు దీనిపై కేసు నమోదు చేశామని నగరం ఎస్సై షేక్ జానీబాషా గురువారం తెలిపారు. మృతుడు బైక్ అదుపు తప్పి పడిపోయాడా? ఏదైనా వాహనం అతడిని ఢీ కొట్టడం వల్ల ప్రమాదానికి గురయ్యాడా! అన్న దానిపై కుటుంబ సభ్యుల నుంచి సందేహాలు వస్తున్న నేపథ్యంలో దీనిపై విచారణ చేస్తున్నామని ఎస్సై చెప్పారు. రాజ్‌కుమార్ మృతదేహాన్ని రాజోలు ప్రభుత్వాస్పత్రికి తరలించామన్నారు.

దగాపడ్డ చర్మకారుల సంఘ రాష్ట్ర అధ్యక్షుడు తుక్కేశ్వరరావు మృతి


తుక్కేశ్వరరావు (ఫైల్)

అమలాపురం రూరల్: మాదిగ కులానికి సేవలందించిన అమలాపురం మండలం సాకుర్రు గ్రామానికి చెందిన దగాపడ్డ చర్మకారుల సంఘ రాష్ట్ర అధ్యక్షుడు ఈతకోట తుకేశ్వరరావు(64) గురువారం మృతిచెందారు. ఆయన కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నారు. తుక్కేశ్వరరావు దళిత ఉద్యమాలలోను, మాదిగ దండోరా ఉద్యమంలోనూ చురుకుగా పాల్గొన్నారు. రాష్ట్ర దగాపడ్డ చర్మకారుల సంఘాన్ని ఏర్పాటు చేసి అధ్యక్షుడిగా ఉంటూ రోడ్డు పక్కన చెప్పులు కుట్టే చర్మకారులకు 45 ఏళ్లకు పింఛన్ ఇవ్వాలని ప్రభుత్వాలను డిమాండ్ చేసి సాధించారు. కొత్త జిల్లాల ప్రతిపాదన రాక ముందే పరిపాలనా సౌలభ్యం కోసం ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా నుంచి కోనసీమను విడగొట్టి దానికి బీఆర్ అంబేడ్కర్ జిల్లా పేరు పెట్టి అమలాపురం జిల్లా కేంద్రంగా చేయాలని తుక్కేశ్వరరావు 72 గంటల నిరాహార దీక్ష చేశారు. తుక్కేశ్వరరావుకు భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. ఎమ్మెల్సీ బొమ్మి ఇజ్రాయిలు, మంత్రి విశ్వరూప్ తనయుడు డాక్టర్ పినిపే శ్రీకాంత్, సర్పంచ్ గుత్తుల చిరంజీవిరావు, జగ్జీవన్‌రామ్ వెల్ఫేర్ సొసైటీ అధ్యక్షుడు మోకాటి నాగేశ్వరరావు, ఉపాధ్యక్షుడు కాప నాగభూషణం మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.


తుక్కేశ్వరరావు మృతదేహానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్సీ ఇజ్రాయిలు

ఇటుకలు విసిరి.. కారం చల్లి..

- సెబ్ సిబ్బందిపై నిందితుడి కుటుంబీకుల దాడి
- ముద్దాయిని అరెస్టు చేసే క్రమంలో ఘటన

కాకినాడ క్రైం: మద్యం కేసులో నిందితుడిని అదుపులోకి తీసుకునే క్రమంలో కాకినాడ ఇంద్రపాలెం సౌత్ సెబ్ సిబ్బందికి చేదు అనుభవం ఎదురైంది. ఈ ఘటనలో ఐదుగురు సెబ్ సిబ్బందికి గాయాలు కాగా, పోలీస్ జీపు ధ్వంసం అయింది. సెబ్ అధికారుల కథనం మేరకు, కాకినాడ ముత్తానగర్‌కు చెందిన అంకాడి దుర్గాప్రసాద్ 2022లో అక్రమ మద్యం అమ్మకం కేసులో నిందితుడు. పోలీసులకు చిక్కకుండా తిరుగుతున్న అతడిని అరెస్టు చేసేందుకు గురువారం తెల్లవారు జామున 5.30 సమయంలో దుర్గాప్రసాద్ ఇంటికి సెబ్ అధికారులు వెళ్లారు. నిందితుడి కుటుంబీకులను నిద్రలేపి దుర్గాప్రసాద్‌ను అదుపులోకి తీసుకున్నారు. జీపు ఎక్కించే క్రమంలో కుటుంబీకులు అడ్డుకోవడంతో పెనుగులాట జరిగింది. ఈ పెనుగులాటలో వారు ఇటుకలతో దాడి చేశారు. సిబ్బంది, అధికారులపై కారం చల్లి నిందితుడిని తప్పించారు. వారి దాడిలో ఇంద్రపాలెం సౌత్ సెబ్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ కేవీ స్వామికి ఎడమ చేతిపైన గాయం కాగా, హెడ్ కానిస్టేబుల్ కేబీవీఎస్ రాజుకు దెబ్బలు తగిలాయి. సెబ్ కానిస్టేబుల్ కె.జ్యోతికి కుడి చేయి బొటన వేలుపైన, సెబ్ కానిస్టేబుళ్ల జీవీవీడీ వీర్రాజుకు మణికట్టు, కాశీ ఈశ్వరుడుకు కాలిమీద గాయాలయ్యాయి. వీరితోపాటు నిందితుడి తల్లి కాకినాడ జీజీహెచ్‌లో చికిత్స కోసం చేరింది. ఆమె ఎడమ చేతికి గాయాలయ్యాయి. సెబ్ సీఐ స్వామి ఫిర్యాదుతో అంగాడి దుర్గ, పాలెపు జగదీశ్వరి, సంగాడి సత్యవతి, రాజోలు సత్యవతి, పంతాడి దేవి, పాలెపు ప్రేమ్ కుమార్, పంతాడి సతీష్‌పై కేసులు నమోదు చేసినట్లు ఇంద్రపాలెం ఎస్‌ఐ నాగార్జున తెలిపారు.


దాడిలో ధ్వంసమైన జీపు

నిందితులకు రెండేళ్ల జైలు

కె.గంగవరం: మండల పరిధిలోని ఊడిమూడి సొసైటీలో స్వప్రయోజనాల కోసం నిధులు దుర్వినియోగం చేసిన ఇద్దరు ఉద్యోగులకు రెండేళ్ల జైలు శిక్ష విధిస్తూ గురువారం రామచంద్రపురం ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి బి.వాణిశ్రీ తీర్పునిచ్చారు. స్థానిక ఎస్సై కె.చిరంజీవి తెలిపిన వివరాల ప్రకారం 2016లో ఊడిమూడి సొసైటీకి చెందిన నిధులను సొసైటీ ఉద్యోగి సత్యనారాయణ, బ్యాంక్ మేనేజర్ వర్మ ఖాతాదారులను మోసం చేసి వారి పేరు మీద వారి రుణాలు తీసుకుని స్వప్రయోజనాల కోసం వాడుకున్నారు. అప్పటి ఎస్సై జి.నరేష్ కేసు నమోదు చేశారు. వాదోపవాదాల అనంతరం నేరం రుజువు కావడంతో రెండేళ్ల జైలు శిక్ష, రూ.20 వేల జరిమానా విధిస్తూ జడ్జి తీర్పునిచ్చారు. ఈ కేసులో ప్రాసిక్యూషన్ తరపున ఏపీపీ రఘువీర్ వాదనలు వినిపించారు.

అంబేడ్కర్ కాంస్య విగ్రహావిష్కరణ

అల్లవరం: గోడిలో నూతనంగా నిర్మించిన డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కాంస్య విగ్రహాన్ని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పినిపే విశ్వరూప్, ఎంపీ అనురాధ, ఎమ్మెల్సీ ఇజ్రాయిల్ గురువారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా అంబేడ్కర్ విగ్రహానికి మంత్రి విశ్వరూప్ పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. మంత్రి విశ్వరూప్ మాట్లాడుతూ ప్రపంచ మేధావి డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఆశయాలకు అనుగుణంగా యువత నడుచుకోవాలని పిలుపునిచ్చారు.

కార్యక్రమంలో వైస్ ఎంపీపీ వడ్డి గంగ, పార్టీ పరిశీలకులు చెల్లుబోయిన శ్రీను, నాతి శ్రీనివాసరావు, మండల పార్టీ అధ్యక్షుడు కొనుకు బాపూజీ తదితరులు పాల్గొన్నారు.

గొల్లవిల్లి సెంటర్‌లో...

ఉప్పలగుప్తం: మండలంలోని గొల్లవిల్లి సెంటర్‌లో నవ చైతన్య దళిత సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన అంబేడ్కర్ విగ్రహాన్ని ఎస్‌ఐ జి.వెంకటేశ్వరరావు, వైఎస్సార్‌సీపీ నాయకులు పరమట సత్యనారాయణ గురువారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా అంబేడ్కర్ విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో కుంచె బాబులు, దేవరపల్లి వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

నగరపాలక సంస్థ :: రాజమహేంద్రవరం
ఆర్.ఓ.సి.నెం. 12285/2002-ఎ1 తేది. 13-04-2023

టెండరు కమ్ వేలం నోటీసు

రాజమహేంద్రవరం నగరపాలక సంస్థ ఆధీనములోని వివిధ షాపింగ్ కాంప్లెక్సులలో ఖాళీగా ఉన్న షాపు రూములు స్వాధీనం చేయబడిన తేదీ నుండి లేదా నగరపాలక సంస్థ నిర్ణయించిన తేదీ లగాయితూ 5 సంవత్సరముల కాలం నెలసరి అద్దె చెల్లించు ప్రాతిపదికపై అనుభవించు గుత్త హక్కును గుడ్విల్ మొత్తముపై టెండరు-కమ్-వేలము నగరపాలకసంస్థ కార్యాలయము నందు ది.24-04-2023 తేదీన నిర్వహించబడును.

షాపులకు సీలు టెండర్లు ది. 24-04-2023 తేదీ మధ్యాహ్నం గం.1.00 ల వరకు స్వీకరించబడి అదే రోజు అనగా ది. 24-04-2023 తేదీ సాయంత్రం గం.4.00 ల నుండి టెండర్లు తెరువకుండానే వేలం నిర్వహించబడును. టెండరు వేయుటకు ఆసక్తి గలవారు కమిషనరు, నగరపాలక సంస్థ, రాజమహేంద్రవరం వారి పేరున డిమాండు డ్రాఫ్టు మరియు బ్యాంకు గ్యారంటీ ఐదు సంవత్సరములకు తగ్గకుండా తీసుకొని ఆఫీసులో టెండరు దాఖలు చేయవలెను. చెక్కులు స్వీకరించబడవు. టెండరు షెడ్యూలు కొరకు రూ.200/- లు ది.23-04-2023 తేదీలోగా నగరపాలక సంస్థ ట్రెజరీలో నగదుగా చెల్లించి పై తెలిపిన ధరావత్తుకు డిమాండ్ డ్రాఫ్టు మరియు బ్యాంకు గ్యారంటి ఆఫీసుకు అందజేసి పొందవచ్చును. ఒక్కొక్క షాపునకు విడివిడిగా టెండర్లు దాఖలు చేయవలెను. టెండరు దాఖలు పరిచినవారిని మాత్రమే వేలమునకు అనుమతించబడును. వేలం కమిషనరు గారిచే గాని, లేదా వారి అనుమతి పొందిన వారిచే గాని నిర్వహించబడును.

టెండరు -కమ్-వేలములో ఖాయపరచిన గుడ్విల్తో పాటు 3 నెలల అద్దె (జి.ఎస్.టి. అదనము) అడ్వాన్సుగా 7 దినములలోగా చెల్లించిన తదుపరి షాపు అప్పగించబడును. నగరపాలక సంస్థ నిర్ణయించు అద్దెపై జి.ఎస్.టి. తో కలిపి చెల్లించవలెను. మొదటిసారి లీజు కాలము 5 సంవత్సరములు, తదుపరి 3 సంవత్సరములకు స్థాయీ సంఘము వారి ఆమోదమునకు లోబడి 33-1/3 శాతం పెంపుదల (లేదా) 10% మార్కెట్ విలువ సంవత్సరము అద్దెగా లేదా పరిసరాల ప్రాంతాలలోని షాపుల అద్దె విలువ ఏది అధికమో దానిపై అద్దె హెచ్చింపు నిబంధనపై పొడిగించబడును. లీజుకాలము 25 సంవత్సరముల వరకు మాత్రమే పొడిగించబడును. తదుపరి షాపు నగరపాలక సంస్థకు అప్పగించవలెను. టెండరు కాని వేలం కాని ఖాయపరచుటకు లేదా తిరస్కరించుటకు కమిషనరు గారికి పూర్తి అధికారం కలదు. మరియు నగరపాలక సంస్థ విధించు అన్ని ఇతర షరతులకు లోబడి వేలము నందు పాల్గొనవలెను.

కమిషనరు
నగరపాలక సంస్థ, రాజమహేంద్రవరం

సాక్షి క్లాసిఫైడ్స్

Education

ONE SITTING
■ ONE SITTING : 10th, 12th, B.A.,B.Com., B.Sc., M.A., M.Com., M.Sc., B.Ed., BBA., BCA., MBA., MCA., Nursing, Pharmacy, Dip invet, B.Tech from Recog. University in INDIA (For Discontinued) Exam in April. Cont : 73383 76874 [R-974]

Real Estate

PLOT FOR SALE
■ కాకినాడ మాధవపట్నం బ్రిడ్జికి 2 1/2 కి.మీ దూరంలో రామేశ్వరం ధర్మరాజుగారి లేఅవుట్‌లో East & West Facing స్థలాలు అమ్మబడును. ✆: 77949 46139 [R-1188134]
■ కాకినాడ న్యూ గైగలపాడు రాజేంద్ర నగర్ దుర్గమ్మ టెంపుల్ వెనుకాల వీధి శ్రీ కృష్ణా సాయి అపార్ట్‌మెంట్ వెనుకల E/F ఫ్లాట్ 242sq. yrds అమ్మకం Ph: 9491228186, 6302322138. [C-1161202]
■ రాజమండ్రి, శ్యామల నగర్, ఓంకార్ స్ట్రీట్ లో 200 చ.గజాలు, North Facing ప్లాట్ క్లియర్ టైటిల్ తో అమ్మకానికి కలదు. సంప్ర: 9370600475 [HA-10724]

Services
■ బంగారము బ్యాంకులలో, ప్రైవేట్, ఫైనాన్స్‌లలో తనఖాలలో ఉన్నవి మాత్రమే విడిపించి కొనబడును. వేలంలో ఉన్న బంగారం విడిపించి తక్కువ గడువు తోటి తనఖా ఇవ్వబడును. ✆ : 73966 71666 S [R-5735]

BUSISNESS OFFER

■ Globale avanu కంపెనీకి ప్రాతినిధ్యం వహించడానికి ఆంధ్రప్రదేశ్ & తెలంగాణలలో కనీస అర్హతను కల్గి మంచి నైపుణ్యం కలిగిన ఏజెంట్స్ కావలెను. మంచి జీతం & Incentives. ✆ 7428038734 [T-1201073]
■ అద్భుత వ్యాపార అవకాశం గ్యాస్, ప్రమాదాలను అరికట్టే సేఫ్టీ డివైస్ ప్రమోట్‌చేస్తూ రో॥ 5000/- వరకు సంపాదించే అవకాశం, ఏరియా వైజ్ ఫ్రాంచైజీలకై సంప్ర: 9100532959 [H-797452]

GOLD FINANCE

■ బంగారం బ్యాంకులలో/ఏ ఇతర ప్రైవేటు సంస్థలలో తాకట్టులో ఉన్నవి విడిపించి ఈ రోజు మార్కెట్ ధర ప్రకారం కొనబడును. (స్పాట్ క్యాష్) 100% జెన్యూన్. ✆ 76508 91999 [B-781966]

Wanted
■ Urgent Recruitment : రాజమండ్రి ప్రముఖ బ్యాంక్ అనుబంధ సంస్థ నందు లేడీ టెలీకాలర్స్, ఎగ్జిక్యూటివ్స్ (M) మరియు కంప్యూటర్ అనుభవం కలవారు (F) కావలెను. ఫోన్ : 99859 54228 [V- 1814]
■ Wanted Calibration sales engineer 0-3 years experience Work Location Allover AP. 7593847146 Mail - career@cyrix.in [B-1165933]
■ VIP's ఇంట్లో పేషెంట్‌ని చూసుకోడానికి స్త్రీలు/పురుషులు అర్జెంటుగా కావలెను.ఆయా,వార్డ్ బాయ్స్ ,నర్సులు, వంటవారు, RMP. Dr. Q:5th- డిగ్రీ, 10-30వేలు జీతం. భో+రూం ఫ్రీ. Hyd. 7993583999 [HA-46]

■ JOB VACANCY. Age 18 to 30, 10th to Any Degree, Office job 18,000 to 25,000, Work from home 15,000 to 18,000, ✆ 8712008071. [T-190376]
■ హృదయాలయం మానసిక దివ్యాంగుల ఆశ్రమం నిడదవోలు, శంకరాపురంలో, జీతంకు పనిచేయుటకు సేవా భావం గల వంట చేయువారు, సహాయకులు, వార్డెన్లు, ఆయాలు, డ్రైవర్ కావలెను.సంప్ర: 94409 42148, 94418 78034 [P-59]
■ పైడా కాలేజీలో పనిచేయుటకు Tele-Callers, Student Counsellors కావలెను. జీతం: 10000- 15000. వివరాలకు ఫోన్ నెం. 7382315999, 7382456539. [HA-00434]

ఈ సెక్షన్‌లో ప్రకటనల కొరకు
సాక్షి క్లాసిఫైడ్స్
నాలుగు లైన్లకు రూ. : 400/-
అదనపు లైనుకు రూ. : 90/-
GST 5% Extra
సర్వే నెం.264, ADB రోడ్, రాజానగరం.
ఫోన్స్: 0883-2483010

గమనిక
సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.